నర్సరీల్లో గ్రీన్ షెడ్‌నెట్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- హరితహారం అమలుకు పక్కా ప్రణాళిక
- ఒక్కో నర్సరీలో 8 వేల మొక్కల పెంపకం


ఇబ్రహీంనగర్‌లోని నర్సరీలో ఏర్పాటు చేసిన గ్రీన్ షెడ్‌నెట్

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెల్లో పచ్చదనం వెల్లివిరియాలని, గ్రామాలు హరితమయం కావాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. దీని కోసం తగిన నిధులు కేటాయించి గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి హరితహారాన్ని పకడ్బందీగా అమలు చేయాలని యోచిస్తోంది. వేసవి నేపథ్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నర్సరీల్లో గ్రీన్ నెట్ షెడ్లను ఏర్పాటు చేశారు. వాటిని నీటితో తడుపుతూ మొక్కలు వాడిపోకుండా సంరక్షిస్తున్నారు. షెడ్ నెట్‌ల ద్వారా ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి మొక్కలకు కావాల్సిన సూర్యరశ్మి తగిలి ఏపుగా పెరుగుతున్నాయి.

ఈ ఏడాది 1.25 లక్షలు

చిన్నకోడూరు మండలంలో ఉపాధి హామీ పథకం కింద నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాది 1.74 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచారు. వర్షాలు ప్రారంభంకాగానే 1.17 లక్షల మొక్కలు నాటారు. ఈ ఏడాది 1.25 లక్షల మొక్కలు పెంచుతున్నారు. 1.68 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో నర్సరీలో 8 వేలకు పైగా మొక్కలను సిద్ధం చేసుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నర్సరీల్లో పెంచే మొక్కలు వాడిపోకుండా షెడ్ నెట్‌లు వేశారు. ఉదయం 9 గంటలలోపే సిబ్బంది మొక్కలకు నీళ్లుపోస్తున్నారు.

రైతులకు ప్రోత్సాహం

హరితహారంలో నాటేందుకు కావాల్సిన మొక్కలను పెంచేందుకు ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల నిర్వహణకు గ్రామాల్లో రైతులను ఎంపిక చేశారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తోంది. మొక్కల పెంపకానికి అవసరమయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోంది. దీంతో నర్సరీల నిర్వహణకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నర్సరీల నిర్వహణలో లోపాలు లేకుండా ఉపాధి హామీ అధికారులు ముందుకు సాగుతున్నారు.

> **మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ**
>
> నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నర్సరీల్లో షెడ్ నెట్‌లు వేశాం. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో పెంచే ప్రతీ మొక్కను కాపాడుతున్నాం. లక్ష్యం మేరకు ఒక్కో నర్సరీలో ఎనిమిది వేల మొక్కలను సిద్ధం చేస్తున్నాం.
>
> – జనార్దన్, ఎంపీడీఓ

క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సత్కారం


అఖిల్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): సివిల్స్ ర్యాంకర్ బుద్ధి అఖిల్‌ను శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం కలిగిన అఖిల్ ఐఏఎస్‌గా ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. సిద్దిపేట జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తెచ్చి యువతకు ఆదర్శంగా నిలిచాడంటూ కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్ర భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్ర జైపాల్‌రెడ్డి, వరాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని అనంతసాగర్‌లో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగిస్తుందన్నారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతసాగర్ గ్రామ అధ్యక్షుడిగా మెట్ల అజయ్, చర్ల అంకిరెడ్డిపల్లి అధ్యక్షుడిగా దుగ్యాని వెంకటయ్య, ఇబ్రహీంనగర్ అధ్యక్షుడిగా మందపల్లి సంపత్, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు పర్శరాములు, గణేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి

విశిష్ట సంపర్క అభియాన్ పార్లమెంట్ కో-కన్వీనర్ శ్రీనివాస్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీతో దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని విశిష్ట సంపర్క అభియాన్ పార్లమెంట్ కో–కన్వీనర్ అంబడిపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా దేశ అభివృద్ధి, సంక్షేమం, ఇతర దేశాలతో సంబంధాలు, దేశ రక్షణ అన్ని రంగాల్లో ప్రధాని మోదీ తనదైన ముద్ర వేశారన్నారు. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ మారిందన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం


మర్రిముచ్చాలలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న గ్రామ అధ్యక్షుడు నర్సింగరావు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామ అధ్యక్షుడు నర్సింగరావు ఎంపీపీ తలారి కీర్తన తో కలసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో బీఆర్‌ఎస్ కీలకపాత్ర పోషించిందని అన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్: బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గజ్వేల్‌లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా జెండాను ఎగురవేయగా, మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, నాయకులు రాధాకృష్ణశర్మ, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు దగ్ధం

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఫర్టిలైజర్ షాపు కాలిపోయిన ఘటన పట్టణ కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గాంధీ విగ్రహం సమీపంలోగల జ్యోతి ఫర్టిలైజర్ షాపులో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. మంటల్లో షాపులోని వస్తువులు కాలిపోయాయి. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు.

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి


బెజ్జంకిలో మాట్లాడుతున్న రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటికీ గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బెజ్జంకిలోని ఎంపీపీ నిర్మల ఇంట్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ అందరికీ అందడం లేదని, మహిళలకు పార్లమెంట్ ఎన్నికల తరువాత ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని సైతం రద్దుచేస్తారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఆర్టీసీకి ఒకనెల మాత్రమే డబ్బులు చెల్లించారన్నారు. అక్రమ వ్యాపారాలు చేస్తోంది కాంగ్రెస్ నాయకులేనని, తమపై బురదజల్లేందుకు భూ కబ్జాలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కొడుకు పేరిట రేగులపల్లె శివారులో 15.20 గుంటల భూమి కొనుగోలు చేసి పౌల్ట్రీ పెట్టుకున్నట్లు తెలిపారు. అందులో ఒక్క గుంట ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిరుపిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ కోసం దశాబ్దాలుగా పోరాడిన వినోద్‌కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు సైరన్‌లు అమర్చితే చర్యలు

సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ



సిద్దిపేటకమాన్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైరన్‌లు అమర్చితే చర్యలు తప్పవని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ హెచ్చరించారు. శనివారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డబులు సైరస్‌లు అమర్చి వాహనాలను నడిపే వాహనలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. వాహనాలకు పోలీసు సైరన్‌లు బిగించడం, అధిక శబ్దాలు వచ్చేలా డబుల్ సైలెన్సర్లు బిగిస్తే చట్టప్రకారమైన చర్యలు తీసుకుంటామన్నారు. గత నెల రోజులుగా జిల్లాలో వాహనాల తనిఖీ నిర్వహించి సైరెన్‌లు బిగించిన పదిమందిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడిన 250 మందికి జరిమానా విధించి, కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అధిక శబ్దాలు వచ్చే వాహనాలను సీజ్ చేశామని, 50 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశామన్నారు.

సదస్సును విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్: ఈనెల 29వ తేదీన హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలన వైఫల్యాలు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి జేఏసీ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. వక్తలుగా ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ కోదండరాం, కన్నెగంటి రవి హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ కో ఆర్డినేటర్లు వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య, కేడం లింగమూర్తి, గడిపె మల్లేష్, కొయ్యడ కొమురయ్య, తక్కళపల్లి రాజగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో పరిశోధనకు మేలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్

సిద్దిపేట ఎడ్యుకేషన్: వర్క్‌షాప్‌లతో విద్యార్థులకు మేలు జరుగుతుందని, ఉత్తమ పరిశోధకులుగా వారిని తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతాయని వక్తలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రొమాటోగ్రఫీ–ఆధునిక పద్ధతులు అంశంపై రెండ్రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా స్పింకో బయోటెక్ కంపనీ మేనేజర్ కృష్ణన్ మాట్లాడారు. వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలుంటాయన్నారు. గ్యాస్, లిక్విడ్ కొమాట్రోగ్రఫీ పనిచేసే విధానం, వాటి అనువర్తనాలను గురించిన విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ కార్యశాలలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు, వర్క్‌షాప్ నిర్వహించిన కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాలకిషన్, కో కన్వీనర్లు ఆంజనేయులు, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సుమలత, శ్యాంసుందర్, సలీం పాష, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జెండాను ఎగరేద్దాం

జెడ్పీటీసీ కడ్తాల రవీందర్‌రెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ కడ్తాల రవీందర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి, మెదక్ కోటపై పార్టీ జెండాను ఎగరేద్దామని దుబ్బాక జెడ్పీటీసీ కడ్తాల రవీందర్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. శనివారం దుబ్బాక పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తదితర కార్యక్రమాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. సాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాధ్యంకాని గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ దుబ్బాక మండల పార్టీ అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, పోలబోయిన నారా గౌడ్, శెట్టి కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ కాస నాగభూషణం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యే హరీశ్‌రావుతో నాయకులు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో జరుగుతున్న మహంకాళి ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు చందర్‌రావు, కిషన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కొండపాక(గజ్వేల్): మండలంలో అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు ఐరన్ సలాకల లోడ్‌తో వెళ్తున్న లారీ శనివారం తెల్లవారుజామున దుద్దెడలో రాజీవ్ రహదారి పక్కన అదుపు తప్పి ఓ ఇంటి ముందు బోల్తా పడింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారు ఉలిక్కిపడి భయంతో బయటకు వచ్చారు. అయితే ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరుతున్న సమీర్

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు హస్తం గూటికి చేరారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, దుబ్బాక మండల రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ వంగ బాల్‌రెడ్డి, తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ శంకర్, పీఏసీఎస్ డైరెక్టర్లు, మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి నీలం మధు, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జగ్గారెడ్డి సమక్షంలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలానికి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు పల్లె బాల్‌రెడ్డి, పంతం శ్రీనివాస్ శనివారం గాంధీ భవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జగ్గారెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

సొంతగూటికి సమీర్

గజ్వేల్: గజ్వేల్ మున్సిపల్ కౌన్సిలర్ షహనాజ్, ఆమె భర్త సమీర్ తిరిగి తమ సొంతగూటికి చేరుకున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలుపొందిన కొంత కాలం తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో సమీర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ముదిరాజ్‌లు మద్దతుగా ఉంటారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లీగల్ సెల్ కార్యదర్శి కొట్టాల యాదగిరి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలనలో ముదిరాజ్‌ల ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. త్వరలో జగదేవ్‌పూర్‌లో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు సత్యం, రాజు, రవి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

శివారు వెంకటాపూర్ గ్రామంలో..

మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్ కోరారు. శనివారం మండలంలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రాల్లో శనివారం ఎన్నికల రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, అబద్దాల పుట్ట బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చెప్పే మాయ మాటలను ఎవరూ కూడా నమ్మే పరిస్థితుల్లో లేదన్నారు. మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలు, మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, నలుగురు పీఏసీఎస్ డైరెక్టర్లు, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటకు చెందిన పలువురు మాజీ వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జెండాల తొలగింపు సరికాదు

గజ్వేల్‌రూరల్: దుకాణాలు, వ్యాపార సముదాయాలపై ఉన్న కాషాయ జెండాలను తొలగించడం సరికాదని బీజేపీ నాయకులు మండిపడ్డారు. శనివారం బీజేపీ గజ్వేల్ పట్టణ కిసాన్‌మోర్చా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలపై ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను ఎవరు చెబితే తొలగించారో సమాధానం చెప్పాలన్నారు. ప్రజలు ఆలోచించి ధర్మం వైపు నిలబడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

హుస్నాబాద్: పట్టణంలోని 1వ వార్డు కేబీ కాలనీలో చేస్తున్న పారిశుద్ధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువల్లో ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం వేయకూడదన్నారు. దీంతో మురుగు పారుదలలేక దోమలు వృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లాం, జూనియర్ అసిస్టెంట్ శంకర్ ఉన్నారు.

◆ విస్తృతంగా వాహనాల తనిఖీలు

మద్దూరు(హుస్నాబాద్): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులుగా పోలీసులు గ్రామాల్లో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆధారాలు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షేక్ యూనుస్ అహ్మద్ మాట్లాడుతూ శుక్రవారం రాత్రి రేబర్తి శివారులో చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన పోలెబోయిన సత్యనారాయణ నుంచి రూ.1,01,650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా శనివారం మండల కేంద్రంలోని ఈద్గా వద్ద జనగాయ జిల్లా నర్మెట్ట మండలం మచ్చుపహాడ్ గ్రామానికి చెందిన భానోతు నవీన్ నుంచి రూ.74,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

◆ అంబులెన్స్‌లో శిశువు జననం

మద్దూరు(హుస్నాబాద్): డెలివరీ కోసం గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్‌లోనే ప్రసవించింది. శనివారం దూళ్మిట్ట మండల పరిధి జాలపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్వేత కాన్పు కోసం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్న క్రమంలో మార్గంమధ్యలో 108 అంబులెన్స్‌లోనే ఆడశిశువుకు జన్మనిచ్చింది. శిశువు, తల్లి క్షేమంగా ఉన్నారు.

◆ వైభవంగా దుర్గమ్మ ఉత్సవాలు

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని లద్నూర్ గ్రామంలో దుర్గమ్మ ఆలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షులు అన్నోజు కనకాచారి, ప్రధాన కార్యదర్శి ఇర్రి భూపాల్‌రెడ్డి, సలహాదారులు బొడుగం మహేందర్‌రెడ్డి, అబ్బర్ల వెంకటనర్సయ్య, దండు సోమయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీ గుజ్జక సమ్మయ్య, మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజన రైతును చితకబాదిన హుస్నాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ పవన్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని భారత ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌నాయక్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొత్తలపర్రెకి చెందిన భూక్య రవి గుడుంబా సరఫరా చేస్తే చట్టపరంగా కేసులు నమోదు చేయవల్సిందిపోయి దాడి చేయడం దారుణమన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ అభివృద్ధి పనులు ప్రారంభించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం వివిధ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల చైర్మన్‌తో మండల కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యాయన్నారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, ఏఈ దేవయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ మద్యం స్వాధీనం

నంగునూరు(సిద్దిపేట): డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పట్టుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ముండ్రాయి వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో డీసీఎంలో 12 కాటన్లలో 144 బీర్లను గుర్తించి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు.

◆ తాగునీటి సమస్య పరిష్కారం

అక్కన్నపేట(హుస్నాబాద్): తండా వాసుల తాగునీటి సమస్య పరిష్కారమైంది. అక్కన్నపేట మండలంలోని కపూర్‌నాయక్‌తండా గ్రామ పరిధిలో మొత్తం ఏడు గిరిజనతండాలు ఉన్నాయి. ఈ తండాలకు మిషన్ భగీరథ నీళ్లు తప్ప పంచాయతీ బోరుబావి లేదు. భగీరథ నీళ్లు అరకొరగా వస్తుండటంతో మాజీ ఎంపీటీసీ సభ్యులు భానోతు భాస్కర్‌నాయక్, అనిల్‌నాయక్, మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి తండాకు రెండు బోర్లు మంజూరు చేశారు. శనివారం బోరు వేశారు. నీళ్లు పుష్కలంగా రావడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

◆ గ్రాడ్యుయేషన్ డే

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని జాలిగామ అంగన్‌వాడీ కేంద్రం 2లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ మాట్లాడుతూ బాల్య విద్య ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు. చిన్నారులకు చదువుతో పాటు ఆటపాటలను నేర్పించడం ద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. గతేడాది ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిన పలువురు పిల్లల్ని తిరిగి అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, హెల్పర్, ఆశ వర్కర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

హుస్నాబాద్‌రూరల్: కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఎంపీపీ లకావత్ మానస విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లెలగడ్డ, పోతారం (ఎస్) గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి మాటతప్పిందని మళ్లీ బీఆర్‌ఎస్‌కు ఎక్కువ సీట్లు ఇస్తే ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగము మధు పాల్గొన్నారు.

◆ సీపీఎం అభ్యర్థిని గెలిపించండి

చేర్యాల(సిద్దిపేట): భువనగిరి ఎంపీగా సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ని గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో కోరారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో నాయకులు పాల్గొన్నారు.

◆ పెద్దమ్మతల్లి సేవలో వెంకట్రాంరెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరు పెద్దమ్మతల్లి ఆలయ ఉత్సవాలలో శనివారం మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆయన వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాచగిరి ఆలయ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి తదితరులు ఉన్నారు.